ఎన్టీఆర్ సేవలు మరువలేనివి

పెద్దపల్లి టౌన్, జనవరి 18: తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్య మంత్రి ఎన్టీఆర్ సేవలు మరువలేనివని జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని అమర్‌నగర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పుట్ట మధు పూల మాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీని స్థాపించి అతి తక్కువ సమయంలో అధికారం చేపట్టారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ అందించిన సేవలను ప్రజలు ఎన్నటికీ మరువలేరని అన్నారు. ఇక్కడ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్ సింగ్, ఓదెల జడ్పీటీసీ గంట రాములు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి, నాయకు లు ఎలువాక రాజయ్య, న్యాయవాధి ఉప్పు రాజు, ఎడెల్లి శంకర్, మస్రత్, గొపగాని సారయ్యగౌడ్, భూతగడ్డ సంపత్, దొడ్డుపల్లి జగదీశ్,తాళ్ల కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న జడ్పీ చైర్మన్ పుట్ట మధు

వినతిపత్రం అందజేస్తున్న దళిత బంధు లబ్ధిదారులు, నాయకులు

దళితబంధు నిధులు విడుదల చేయాలి

ధర్మారం,జనవరి18: కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకంలో ఎంపికైన వారికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దార్ రజితకు దళిత బంధు లబ్ధిదారులు, దళిత సంఘాల నేతలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దశాబ్దాలుగా ఆర్థికంగా వెనుకబడిన షెడ్యూల్ కులాల అభ్యున్నతికి కేసీఆర్ ప్రభుత్వం 'దళిత బంధు' పథకాన్ని ప్రవేశ పెట్టిందని అన్నారు. మొదటి విడుతలో పలువురిని ఎంపిక చేసి రూ.10 లక్షల సాయం అందించడంతో, లబ్ధిదారులు యూనిట్లను ఏర్పాటు చేసుకొని జీవనోపాధి పొందుతున్నారని వారు పేర్కొన్నారు. రెండో విడుతలోనూ లబ్ధిదారులను ఎంపిక చేసిన అనంతరం అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడడంతో నిధులు విడుదల కాలేదని వివరించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు లబ్ధిదారుల ఖాతాలను ఫ్రీజ్ చేసిందన్నారు. అకౌంట్లలో ఉన్న డబ్బులు కూడా డ్రా చేసుకునే అవకాశం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని కొనసాగించాలని, ఫ్రీజింగ్‌ను ఎత్తివేసి నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు సుంచు మల్లేశం, పెర్క బానేష్, చొప్పదండి మల్లేశం, దూడ సురేష్, కాదాసీ చంద్రమోహన్, శనిగారం మల్లేశం, చొప్పదండి దుర్గయ్య,కాంపెల్లి తిరుపతి,నెరువట్ల వెంకటేష్, శనిగరపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కల్తీకల్లు బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

కోల్‌సిటీ, జనవరి 18: కల్తీ కల్లు తాగి చనిపోయిన యువకుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్, ఉపాధ్యక్షుడు రేణికుంట్ల నరేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గోదావరిఖని అడ్డగుంటపల్లిలోని కల్లు డిపోలో బుధవారం రాత్రి కల్తీ కల్లు తాగి ఇద్దరు యువకులు మృతి చెందిన సంఘటన బాధాకరమని పేర్కొన్నారు. డిపో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.20లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పారిశ్రామిక ప్రాంతంలో కల్తీ మద్యం విక్రయాలు జరగడానికి కారణమైన ఎక్సైజ్ పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌ను కోరారు. గత ప్రభుత్వ హయాంలో కల్తీ మద్యంను నియంత్రించారనీ, ఈ ప్రభుత్వం వచ్చాక మళ్లీ కల్తీ మద్యం జోరందుకుందని ఆరోపించారు.

తిలక్‌నగర్‌కు నయా లుక్

- 'కోరుకంటి' ఖాతాలో మరో కలికితురాయి
- రూ.50లక్షలతో జంక్షన్ నిర్మాణం పూర్తి

కోల్‌సిటీ, జనవరి 17: నిన్న, మొన్నటిదాకా సాదాసీదాగా కనిపించిన గోదావరిఖనిలోని తిలక్‌నగర్ నయా లుక్ సంతరించుకున్నది. కోరుకంటి చందర్ ఖాతాలో మరో కలికితురాయిగా అభివృద్ధిని చూపిస్తున్నది. రామగుండం నగర సుందరీకరణ లక్ష్యంగా గత ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సీఎం గ్రాంట్ నుంచి నగరంలో పలు చోట్ల జంక్షన్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా 44వ డివిజన్ తిలక్‌నగర్ సెంటర్ రూపురేఖలు మార్చేందుకు గత ఏడాది రూ.50లక్షలతో అధునాతన హంగులతో జంక్షన్ నిర్మాణానికి పునాది రాయి వేశారు. ఆ వెంటనే పనులు కూడా చకచకా మొదలయ్యాయి. అంతలోనే ఎన్నికల కోడ్‌తో పనులు ఆగిపోగా, ఇప్పుడు మళ్లీ ఊపందుకున్నాయి. దీంతో తిలక్‌నగర్ ఇప్పుడు జంక్షన్‌గా మారి, కొత్త అందాలను తీసుకొచ్చింది. త్వరలో ప్రారంభానికి సిద్ధమైంది. రామగుండం సుందరీకరణలో భాగంగా ఇప్పటికే ప్రధాన చౌరస్తాతోపాటు రాజేశ్ థియేటర్, ఫైవింక్లయిన్ చౌరస్తాలను గత ప్రభుత్వం పూర్తిగా జంక్షన్లుగా మార్చింది. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ప్రత్యేక చొరవ తీసుకొని సీఎం గ్రాంట్ నిధుల నుంచి తిలక్ నగర్, రమేశ్ నగర్‌లో జంక్షన్లు తీర్చిదిద్దాలని సంకల్పించారు. ఆ తడవుగానే చేపట్టిన పనులు ఇప్పుడు పూర్తయ్యాయి. తిలక్‌నగర్‌లో విద్యుత్ కాంతుల మధ్య జంక్షన్ నిర్మాణం ఔరా అనిపిస్తోంది. త్వరలోనే రమేశ్ నగర్ జంక్షన్ నిర్మాణం పూర్తి కాబోతున్నది.

గోదావరిఖని తిలక్‌నగర్‌లో పూర్తయిన జంక్షన్ నిర్మాణం

సాగులో సాంకేతికను వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- డ్రోన్ ద్వారా ఎరువుల పిచికారి పరిశీలన

అంతర్గాం : డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

అంతర్గాం, జనవరి 18: వ్యవసాయంలో వచ్చే నూతన సాగు పద్ధతులు, సాంకేతికతను రైతులు వినియోగించుకొని అధిక లాభాలు సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. మండలంలోని పెద్దంపేటలో డ్రోన్ పరికరాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. అనంతరం డ్రోన్ ద్వారా మార్త రాములు వరి పొలంలో పురుగుల మందు పిచికారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. రోజు రోజుకూ పెరుగుతున్న కూలీల కొరత కారణంగా రైతులు అధునాతన సాంకేతిక వైపు మళ్లాలని దీని వల్ల ఖర్చు, సమయం రెండు తగ్గుతాయని సాంకేతికతను వినియోగిస్తూ అధిక లాభాలు పొందాలన్నారు. అంతర్గాం మండలం రాయదండికి చెందిన నిరుద్యోగ యువకులు పల్లె రాజు, శ్యామ్ ఎస్‌బీఐ నుంచి రూ.25లక్షల రుణ సదుపాయం పొంది డ్రోన్ పరికరాన్ని కొనుగోలు చేశారు. 20 లీటర్ల కెపాసిటీతో డ్రోన్ ట్యాంకు ఉందని, దీని ద్వారా ఒక ఎకరంకు ఎరువులు, విత్తనాలు 10 నుంచి 15 నిమిషాల వ్యవధిలో చల్లడం పూర్తి చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఏఓ రాంబాబు, తహసీల్దార్, ఎంపీడీవో, ఏఈవో, సర్పంచ్, ఎంపీటీసీ , రైతులు పాల్గొన్నారు

సమ్మక్క జాతర ప్రదేశం పరిశీలన

అంతర్గాం మండల పరిధిలోని గోలివాడ శివారు గోదావరి తీర ప్రాంతంలో వచ్చే నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న సమ్మక్క-సారలమ్మ జాతర ప్రదేశాన్ని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సందర్శించారు. భక్తుల స్నాన ఘాట్లు, క్యూలైన్లు, భక్తుల విడిది తదితర ప్రాంతాలను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని కమిటీ సభ్యులకు సూచించారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తహసీల్దార్ పీ రామ్‌మోహన్‌రావు, ఎంపీడీవో యాదగిరిలను ఆదేశించారు. భక్తులకు మౌలిక సదుపాయాల కల్పన కోసం ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇక్కడ ఎంపీపీ దుర్గం విజయ, జట్పీటీసీ ఆముల నారాయణ, వైఎస్ ఎంపీపీ మట్టలక్ష్మీ మహేందర్‌రెడ్డి, జాతర కమిటీ చైర్మన్ పెండ్రు హనుమాన్‌రెడ్డి, సభ్యులు కోల రామ్మూర్తిగౌడ్, ఆవుల గోపాల్ యాదవ్, బలసాని సత్తయ్యగౌడ్, దొంతుల గంగయ్య, పల్లికొండ తిరుపతి ఉన్నారు.

గోదావరిఖని : మాట్లాడుతున్న కలెక్టర్

డంప్ యార్డు ప్రతిపాదనలు పంపాలి

గోదావరిఖని, జనవరి 18: నిర్దేశించిన స్థలంలో డంప్ యార్డు ఏర్పాటుకు ప్రతిపాదనలను త్వరగా సమర్పించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. రామగిరి మండలం సుందిళ్ల శివారులో డంప్ యార్డు కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ప్రతిపాదనలు రూపొందించి ఆమోదం పొందాలని తెలిపారు. తడి, పొడి చెత్త షెడ్లు ఏర్పాటు, అప్రోచ్ రోడ్డు, తదితర ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. ఆయన వెంట కమిషనర్ నాగేశ్వర్, ఎస్ఈ చిన్నారావు, నాగభూషణం, తాసీల్దార్ కుమారస్వామి తదితరులున్నారు.

రామగుండం బీ థర్మల్‌ను విస్తరించాలి

జ్యోతినగర్(రామగుండం), జనవరి 18: రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 500మెగావాట్లతో విస్తరించాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కోరారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో టీఎస్ జెన్‌కో సివిల్ డైరెక్టర్ ఎ అజయ్‌ను గురువారం కలివారు. మూతపడే దశలో ఉన్న 62.5మెగావాట్ల రామగుండం బీ థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని 500మెగావాట్లతో విస్తరణ పనులు మొదలు పెట్టాలన్నారు. విస్తరణకు స్థానికంగా బొగ్గు, నీరు అందుబాటులో ఉందన్నారు. ప్లాంటు విస్తరణతో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా భరోసాగా ఉంటుందని, స్థానికులు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. విస్తరణకు కావాల్సిన అనుమతులు, ఇతర సహాయ సహకారాలు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్నట్లు ఎమ్మెల్యే డైరెక్టర్‌కు వివరించారు.

సంఘటితంగా పోరాటం చేయాలి

నిబద్ధతతో పనిచేస్తున రైల్వే కార్మికులు సంఘటితంగా తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. అన్నారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన రైల్వే కార్మిక సంఘాల సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ జనరల్ బాడీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాబోయే రోజుల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టబోతుందని, రైల్వే కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను రైల్వే సంఘాల నాయకులు సన్మానించారు.

మహా ధర్నాకు తరలిన లోకో పైలట్లు

రైల్వే లోకో పైలట్ల సమస్యలు పరిష్కారించాలని కోరుతూ ఆల్ ఇండియా లోకో పైలట్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ గురువారం నిర్వహించిన మహాధర్నాకు రామగుండం రైల్వే లోకో పైలట్లు తరలివెళ్లారు. రామగుండం లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ సెక్రటరీ రవి ఆధ్వర్యంలో హాజరయ్యారు.

రూ .2 లక్షల ఎల్వోసీ అందజేత

సుల్తానాబాద్ రూరల్, జనవరి 18: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు రూ. 2 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. హైదరాబాద్‌లో అతని కుటుంబ సభ్యులకు పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు గురువారం ఎల్వోసీ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గొల్లపల్లి సర్పంచ్ బండారి రమేశ్, బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఆర్టిస్ట్

ఎలిగేడు, జనవరి 18: ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావును ఎలిగేడుకు చెందిన పేద ఆర్టిస్టు (రూపం ఆర్ట్స్) చెల్లోజు శ్రీనివాస్ బాబు గురువారం సన్మానించారు. అతను చేతితో గీసిన పెయింటింగ్‌ను అందించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ధర్మారం,జనవరి18:స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని కరీంనగర్ నెహ్రూ యువకేంద్ర వలంటీర్ రేషవేని సాగర్ ఆధ్వర్యంలో ధర్మారంలోని సాధన జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఎంపీడీవో భీమ జయశీల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

ధర్మారం,జనవరి18: మండలంలోని పైడిచింతపల్లిలో బీసగోని నర్సింగం గౌడ్ (75) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సింగం భార్య 15 ఏళ్ల క్రితం చనిపోయింది. భార్య తనువు చాలించిన ప్పటి నుంచి నర్సింగం మానసికంగా కృంగి పోయి మద్యానికి బానిసయ్యాడు.ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన నర్సింగం గురువారం ఉదయం గ్రామ శివారులోని తన పొలం వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుని కొడుకు తిరుపతి గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రుణాలను గడువులోగా చెల్లించాలి

మంథని, జనవరి 18: మంథనిలోని పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలను గడువులోగా చెల్లించాలని చైర్మన్ కొత్త శ్రీనివాస్ కోరారు. గురువారం సంఘం కార్యాలయంలో మండలంలోని బిట్టుపల్లి గ్రామానికి చెందిన మందల ప్రకాశ్ రెడ్డికి దీర్ఘకాలిక రుణం కింద మంజూరైన రూ.6లక్షల విలువైన చెక్కును అందజేశారు. డైరెక్టర్ కొత్త శ్రీనివాస్, ఎంపీటీసీ గుమ్మడి సత్యవతి రాజయ్య, సీఈవో అశోక్ కుమార్‌లు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

కమాన్‌పూర్, జనవరి 18: గ్రామాల వారీగా అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి నివేదికలను ఎంపీడీవో కార్యాలయంలోఅందజేయాలని డీఎల్పీవో రాంబాబు ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. 2024-25 కు సంబంధించిన ప్రణాళికలతోపాటు 2023-24కు సంబంధించి పూర్తి కాని పనులతో వేర్వేరుగా నివేదికలు అందజేయాలని ఆయన ఆదేశించారు. ఈనెల 22లోగా శాఖల వారీగా ప్రణాళికలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. వీటిని ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని చెప్పారు. ఫిబ్రవరి 7 లోగా మండల, జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులను ఆమోదించుకోవాల్సి ఉంటుందన్నారు. ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో శేషయ్య, ఏఓ ప్రమోద్ కుమార్, ట్రాన్స్‌కో ఏఈ రాజేంద్రకుమార్, పీఆర్ ఏఈ రాధ, అధికారులు పాల్గొన్నారు.

తబితా ఆశ్రమంలో ఎన్టీఆర్ వర్ధంతి

జ్యోతినగర్(రామగుండం), జనవరి 18: మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా 20వ డివిజన్ కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో రామగుండంలోని తబితా ఆశ్రమంలో నివాళులర్పించారు. ఆశ్రయానికి 25కిలోల బియ్యం అందజేసి చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఇక్కడ అభిమానులు షేక్ ఇంతియాస్, కలవేని మల్లేశ్, సిమ్మని ప్రసాద్, గుండా రాజు, సంతోష్, హనుమాన్ సింగ్, తదితరులు ఉన్నారు.

మంథనిలో..

మంథని, జనవరి 18: పట్టణంలోని బొక్కలవాగు బ్రిడ్జిపై ఎన్టీఆర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడ నాయకులు ఏగోలపు శంకర్‌గౌడ్, కొట్టె రమేశ్, బీఆర్ఎస్ నాయకులు, ప్రకృతి ప్రేమికుడు గట్టు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 18: పట్టణంలోని గౌతమినగర్‌లోని మైనార్టీ గురుకుల జూనియర్(బాలుర) కళాశాలలో 2024-25లో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మీర్జా సిరాజ్‌బేగ్ తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న మైనార్టీ, మైనార్టీయేతర విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో లో మైనార్టీలకు 30సీట్లు, మైనార్టీయేతరులకు 10 సీట్ల చొప్పున ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. వివరాలకు కళాశాలలో నేరుగా సంప్రదివచ్చని లేదా 99489 78628, 9949258084లలో సంప్రదించాలన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి

మంథని, జనవరి 18 : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా చంద్రుపట్ల సునీల్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు జీ కిషన్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎలిగేడు : క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న డీటీఎఫ్ నాయకులు

డీటీఎఫ్ క్యాలెండర్ విడుదల

ఎలిగేడు, జనవరి 18: మండలంలోని సుల్తాన్‌పూర్ హైస్కూల్ ఆవరణలో డీటీఎఫ్ - 2024 క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పిడి సంతోష్‌రెడ్డి, నాయకులు గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రమోషన్‌లు, బదిలీలు చేపట్టాలని, 317 జీవో బాధితులందరికీ న్యాయం చేయాలని కోరారు.ఉపాధ్యాయుల సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నీ వెంకటేశ్వరరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఎం రామ్మోహన్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ నరేంద్రచారి, నాయకులు వెంకటేశ్వర్లు, రాములు, ఉపాధ్యాయులు సంధ్య, బాలకృష్ణ, వేణు, కుమారస్వామి, తిరుపతి, పద్మ, బాలకృష్ణ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ విడుదల

ఫర్టిలైజర్‌సిటీ, జనవరి 18: గోదావరిఖని ఆర్టీసీ డిపో పద్మశాలీ ఉద్యోగుల సంఘం న్యూయర్ క్యాలెండర్‌ను గురువారం డిపోలో డిపో మేనేజర్ మచ్చ నాగభూషణం విడుదల చేశారు. ఇక్కడ సూపరింటెండెంట్ ఫైనాన్స్ కన్నం సదానందనం, రిటైర్డు టీ12 కనకయ్య, సంఘం నాయకులు బండి శ్రీనివాస్, ఎంఎల్ నారాయణ, రవీందర్, రాజావీరు, దూస సంపత్, చిప్ప మల్లేశ్, గుండేటి రాజేంద్ర ప్రసాద్ ఉన్నారు.

దుప్పట్లు పంపిణీ

కోల్‌సిటీ, జనవరి 18: గోదావరిఖనికి చెందిన రిటైర్డ్ పోలీస్ కానిస్టేబుల్ దేవి లక్ష్మీ నర్సయ్య నిరుపేద వృద్ధులకు దుప్పట్లు అందజేశారు. గురువారం ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్తుండగా, మార్గమధ్యం లో చలికి వణుకుతూ ఇబ్బంది పడుతున్న ఓ వృద్ధురాలిని గమనించాడు. వెంటనే దుప్పట్లు కొనుగోలు చేశాడు. గోదావరిఖని బస్టాండ్ ఏరియాలో రోడ్డు పక్కన చలికి ఇబ్బంది పడుతున్న వృద్ధుల వద్దకు వెళ్లి వాటిని అందజేసి ఉదారతను చాటుకున్నాడు. తోటి మిత్రులు, వాకర్స్ లక్ష్మీనర్సయ్యను అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మారం,జనవరి18: మండల కేంద్రంలో సిరిగిరి సమ్మయ్య @ టోనీ రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేయగా ఎస్ఐ టీ సత్యానారాయణ పట్టుకున్నారు.ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సమ్మయ్య పలువురి నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేశాడు. పక్కా సమాచారం మేరకు గురువారం రాత్రి 7:30 ఇంట్లో సోదా చేశారు. సుమారు 4.50 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉండగా పట్టుకున్నారు. అనంతరం సివిల్ సప్లై అధికారులకు సమాచారం ఇచ్చారు. సదరు శాఖ అధికారుల ఆదేశానుసారం సమ్మయ్యపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వివరించారు.

చికిత్స కోసం ఆర్థిక సాయం

ధర్మారం,జనవరి18: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తికి ఎన్ఆర్ఐ కొలుముల దామోదర్ అండగా నిలిచారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఆయన (కెనెడా) చికిత్స ఖర్చుల కోసం రూ. 10 వేలు అందించారు. ఎర్రగుంటపల్లికి చెందిన కొడిచెర్ల స్వామి వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేర్పించారు. తమది నిరుపేద కుటుంబమని..చికిత్స ఖర్చుల కోసం దాతలు సాయం చేయాలని అతని భార్య మాలశ్రీ సోషల్ మీడియా ద్వారా వేడుకున్నది. ఈ విషయాన్ని అదే గ్రామానికి చెందిన సుభాష్ దామోదర్‌కు ఫోన్ చేసి చెప్పగా తన ఫౌండేషన్ ద్వారా రూ.10 వేలు పంపించాడు. గురువారం ఫౌండేషన్ ఇన్‌చార్జి వేల్పుల నాగరాజు దవఖానలో మాలశ్రీ కి అందించాడు. సాయం చేసిన ఎన్ఆర్ఐకి స్వామి భార్య కృతజ్ఞతలు తెలిపింది.

సాయం అందిస్తున్న నాగరాజు

బంకర్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

బంకర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డైరెక్టర్

యైటింక్లయిన్ కాలనీ, జనవరి 18: సింగరేణి సంస్థ ఓసీపీ-3 ప్రాజెక్టు సీహెచ్‌పీలో నిర్మిస్తున్న గ్రౌండు లెవల్ బంకర్ నిర్మాణపు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంస్థ డైరెక్టర్ (ఈ అండ్ఎం) బీ. సత్యనారాయణరావు సూచించారు. గురువారం ఆర్జీ-2 ఏరియా జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ఇఅండ్ఎం జీఎం నవీన్ కుమార్‌లతో కలిసి ఓసీపీ-3 ప్రాజెక్టులో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. 161 కోట్ల రూపాయలతో నిర్మాణం చేపడుతున్న 10వేల టన్నుల సామర్థ్యం గల గ్రౌండ్ లెవల్ నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. బంకర్ నిర్మాణంలో నాణ్యత పాటించాలని సూచించారు. సబ్ స్టేషన్, రిటైల్‌వాల్, ఫీడర్ నిర్మాణపు పనులను పరిశీలించి పనులు వేగంగా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. ప్రాజెక్టు అవసరాల కోసం చేపడుతున్న అభివృద్ధి పనులు వర్షాకాలం వచ్చేలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రాజెక్టు అధికారి మధుసూధన్, ఏరియా ఇంజనీర్ నర్సింహరావు, డీజీఎం (ఇఅండ్ఎం) కేశవ రావు, ప్రాజెక్టు ఇంజనీర్ రాజాజీ, డీజీఎం(ఎ) ఎర్రన్న, సివిల్ డీజీఎం ధనుంజయ్, సీహెచ్‌పీ ఎస్ఈ సదానందం, అధికారులు ఉన్నారు.

అల్ఫోర్స్‌లో శ్రీరామనామ నామం

సుల్తానాబాద్, జనవరి 18: అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ నేపథ్యంలో సుల్తానాబాద్‌లోని అల్ఫోర్స్ స్కూల్‌లో గురువారం రామనామ విద్యార్థులు రామ నామ ఆకృతిని ప్రదర్శించారు. విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్

జ్యోతినగర్, జనవరి 18: రామగుండం నియోజకవర్గంలో కొత్తగా ఓటరు నమోదు, మార్పులు చేర్పుల కోసం ఈ నెల 21, 22తేదీల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు తహసీల్దార్ కుమారస్వామి తెలిపారు. ప్రతీ బూత్ లెవెల్ అధికారి వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. కొత్త ఓటరు నమోదు కోసం, ఓటరుకార్డులో మార్పులు చేర్పుల కోసం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆయన కళ్లు సజీవం

మంథని రూరల్, జనవరి 18: మంథని మండలం కన్నాల గ్రామానికి చెం దిన గద్దల వెంకటి మృతి చెందగా ఆయన కండ్లను కుటుం బ సభ్యులు దానం చేశారు. అనారోగ్యంతో బాధపడుతు న్న వెంకటి గురువారం ఉదయం మృతి చెందగా ఆయన కళ్లను కుమారులు దేవేందర్, ప్రశాంత్, వెంకటేశ్, సదన్‌కుమార్‌లతో పాటు కుటుంబ సభ్యులు ఎల్‌వీ ప్రసాద్ ట్రస్టు దానం చేశారు. మృతుడి కళ్లను దానం చేసిన కుటుంబ సభ్యులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

కళాబృందం ప్రదర్శన

పాలకుర్తి, జనవరి18: పాలకుర్తి మండలం రాణాపూర్ గ్రామంలో తెలంగాణ సాంస్కతిక సారథి కళాబృందం గురువారం కళాప్రదర్శన చేశారు. యువత డ్రగ్స్, మత్తు పదార్థాల బారిన పడకూడదని, గ్రామల్లో పరసరాలు పరిశ్శుభ్రంగా ఉచంపకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళా కారులు గుండ్ల స్నేహలత, దయానర్సింగ్, బుర్ర శంకర్‌గౌడ్, డిల్లీ వెంకటస్వామి, సానకొండరవీందర్, స్పందన, శ్వేత, నారగోని సరిత, ఉప్పు స్పందన తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-319415-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194